కథానిక

# శృంఖలానిబద్ధుడు

"వాహిని"

'ఏమిరా శేఖరం, మీ అమ్మ యింట్లో వుందిరా?' అని అడిగాడు లక్ష్మణరావు- వాడ్నూ తొమ్మిదేళ్ళ వాడే. స్నేహితుడు.

'ఎందుకురా? లేదు!'

'మా అమ్మేమో, కొంచెం యింగువుంటే యిమ్మంది.' 'లేదురా మాఅమ్మ, ఇంట్లో-'

'పోనీ నువుతీసి ఇవ్వకూడదూ? గదులపెట్టి నీకు తెలీదేంటి?'

'నాకు తెలుసుగాని నేను తీసివ్వను.'

'మీఅమ్మ తంతుందా?' అని నవ్వాడు లక్ష్మణరావు.

'అవునురా వెధవ్వి- నువ్వయినా మీఅమ్మ యింటో లేనప్పుడు ఏం తీసిచ్చినా మీ అమ్మ తన్నదేంట్రా?'

'మా అమ్మ అలా యెప్పుడూ తన్నదు తెలుసా?'

'పోనీలే. మా అమ్మ తంతుంది. ఇంగువ లేదు పో.'

'ఓరే, బొంగరాలాడుకుందాం వొస్తావూ?'

'నేను రాను బాబూ!'

'ఎందుకు రావేం—?'

'బొంగరం మా అన్నయ్యదగ్గిరుండిపోయింది. అదిగాక ఆడితే వాడు మా నాన్నతో చెప్పేస్తాడు.'

'మీ అన్నయ్య ఇంటో వున్నాడా?'

'వాడేంటి? పోతుకోడిలాగ కుర్చీలో కూచున్నాడు.'

'పోనీ-నువ్విప్పుడు చదువుతున్న ఆపుస్తకం అక్కడ పడేసి లెక్కలు చేసుకుందాం మా యింటికి రా.' 'మా నాన్న నడిగిరావాలి. మరి ఆయనిప్పుడింటో లేరుగా!'

'పోనీ భయంలేదు రద్దూ!'

'అమ్మయ్యో నేను రాను.'

'లెక్కలు చేశాడని చెప్తానులే నేను. పద.'

'వొద్దు బాబూ. ఎలక్కి పిల్లి సాక్ష్యమని మక్కలిరగ్గొడతారు. నేనే పెద్దయితే మా అన్నయ్యలాగే హాయిగా వుందును. వాడంత అవనీ చెప్తాను!'

* * *

'ఏమిరా శేఖరం- ఇంటరు పాసయ్యావుట. ఏక్లాసు?' అని అడిగాడు లక్ష్మణరావు.

'నువు పరీక్షలవుతున్నప్పుడు నెంబరు నోట్ చేసుకువెళ్లావు. ఏక్లాసో చూడకపోయినా?'

'లేదురా- అన్ని నెంబర్లూ కలిపి వో కాయితం మీద రాశాను- ఆ కాయితం ఎక్కడో పోయింది. సరేకాని ఫస్టుక్లాసొచ్చిందా?'

'ఆఁ వొచ్చింది. వెధవ ఫస్టుక్లాసే రాలేదా? రాత్రీ పగలూ విసుగులేకండా చదువు చదువని యింట్లోవాళ్లు పొడుచుకు తింటుంటే ఫస్టుక్లాసే రాకపోవాలీ?'

'పాపం, నీకు కాసేపన్నా తిరగాలని వుండేది కాబోలు.'

'కాదుట్రా మరి- తలుపు దాటి బైటికివొచ్చే సరికల్లా మీరందరూ ఏ సినిమా గురించో ఏ పెద్ద నావలిస్టు రాసిన నవలల గురించో మాట్లాడుతుండేవాళ్ళు. నాకూ కాస్త టేస్టు అనేది వుందా లేదా మరి?—'

'అయితే—?'

'అయితే యేమిటి గియితే. ఎప్పుడూ వాళ్ల ఆజ్ఞానుసారం ప్రవర్తిస్తూ వాళ్లకి దాసోహం చెబుతూ వుండవలసొచ్చింది. ఒక్క మా వొదినె తప్ప తక్కిన ముగ్గురూ నన్ను ఆజ్ఞాపించేవాళ్లే అయ్యారు.'

'మీ వదినెగారు ఆజ్ఞాపించలేదేమిటి?'

'ఛ— కాని ఆవిడ నామనస్సు బాధపెట్టలేదని నేను కచ్చితంగా చెప్పలేను. ఎందుకని అడుగుతావు- విను చెప్తాను. ఆవిడ కూడా యింతో అంతో చదువుకుంది, నవీనాభిరుచులున్నాయి గదా. ఏవో ఆసీ యిసీ చదువు

తుంది అక్కడా అక్కడా. నాదగ్గిర అవన్నీ వర్ణిస్తుంది. నాకిలా వొళ్లు మండిపోతుంది. చదవలేను, చదవకుండా వుండలేను. ఇంకా ఏం చేస్తుందో తెలుసా ఆవిడ- నువ్వు చదవలేదోయ్- అని 'పిటీ' చేస్తుంది. దాంతో నేనిట్లా అధః పాతాళంలో వుండిపోవడమేనా అనిపిస్తుంది.'

'పేపరు చదువుతానని యింట్లో చెప్పి లైబ్రరీలో చదవలేకపోయావూ?'

'దీనికి రెండు అడ్డు వొచ్చాయి. అలా చెప్పి లైబ్రరీలో ఏవేవో పుస్తకాలు తీసుకుని చదివేవాడిని, చాలసార్లు మా అన్నయ్య కంటపడిపోయాను. రెండుమూడు సార్లు వార్నింగు ఇచ్చాడు. తరవాత ఏకంగా నన్ను వెళ్ళనిచ్చే వాళ్లేకాదు. ఇంక రెండోది ఏమిటంటావా, లైబ్రరీలో మెంబరుషిప్పు తప్పించేసుకున్నారు. దాంతో పుస్తకాలు అసలు కరువైపోయినై.'

'అయితే మొత్తానికి అస్వతంత్రమైన జీవితం గడిపానంటావు. అంతేనా?'

'అస్వతంత్రమని మెల్లిగా అంటున్నావా? ఛస్తున్నాను. దేనికీ స్వేచ్ఛ లేదు.'

'నువ్వు మనిషిగా జీవించడానికి ప్రయత్నం చెయ్యలేదని నా అభిప్రాయం. దీనికి నువ్వేమంటావ్?'

'నువ్వు పొరపాటు పడ్డావంటాను. అయితే కొంతవరకూ అది నిజమే అయినా, ఇకముందు నేను స్వేచ్ఛగా జీవించటానికి ప్రయత్నాలు విశేషంగా చేస్తున్నానులే.'

'ఏమిట్రోయ్ అవి?'

'ఇంటరు ఫస్టుక్లాసులో వొచ్చాంగా, ఇంజనీరింగు కాలేజీకి అప్లికేషను పెట్టాను. సీటొచ్చిందా, ఇక మనం వీళ్ళు చెప్పినట్టు వినం; మెడ్రాసు పోయామంటే స్వేచ్ఛ లభించిందన్నమాటే.'

'ఓరి బడ్డూ! నీకింకా అక్కడి సంగతి తెలియకుండా వుంది. ఇంజనీరింగు కాలేజీలో వేషాలు వేశావంటే మూడురోజుల్లో యింటికి పమ్మించేస్తారు తెలుసా?'

'అయినా కొంచెం—'

'కొంచెంలేదు లావూ లేదు.'

'—కాని అసలుకే మోసం వొచ్చేది ఒకటుందిరా. మా ఫాదరు బి. యస్సీ. చదవమంటున్నారు.'

'ఏం చేత?'

'మా అమ్మ పోరువల్ల. నేనెక్కడో వుంటే ఆవిడకి మనస్థిమితం వుండదుట. అందుచేత నేనిక్కడే వుండి బి. యస్సీయే చదవాలిట కాని నామీద నాకే అసహ్యం వేస్తోందిరా ఇప్పుడు- ఏంచేతంటావు, చిన్నతనంనించీ స్వేచ్ఛ లేకుండా నేవుంది నాజీవితం. ఇకముందు ఉంటుందని నమ్మకంలేదు. నాకు కెమిస్ట్రీ అంటే యిష్టమని నీకు తెలుసుగా- మా నాన్న ఫిజిక్సు చదవమంటారు- కెమిస్ట్రీ అయితే సులభంట. ఎపాయింట్‌మెంట్ దొరకదుట. ఫిజిక్సయితే గౌరవం వుంటుందిట; వేగం ఎపాయింట్‌మెంట్ దొరుకుతుందిట. అందుకని ఫిజిక్సు చదవాలట!'

'చెప్పలేకపోయినా? నాకు ఫిజిక్స్ రాదని!'

'ఎలా చెప్పను? చెప్పినా మార్కులు చెప్పనిస్తయ్యా? ఫిజిక్సులో నూటపదిహేడు వొచ్చాయి, కెమిస్ట్రీలో తొంభై ఆరే వొచ్చాయి. అదీగాక ఫిజిక్సు రాదన్నంత మాత్రాన వూరుకుంటారా? నేచెప్తానంటారు. నూరి, రంగరించి మరీపోస్తారు. నీకు తెలీదేమిటి, మా ఫాదరు ఎమ్మెస్సీ ఫిజిక్సు!'

'తెలుసులే. అయితే అందుకు మరో వుపాయం లేదూ?'

'ఏం వుపాయమూ లేదురా, నాకు మతిపోతోంది. మళ్లీ కలుసుకుందాముగా బ్రదర్'

* * *

'ఉన్నట్టుండి నీకు బి. యస్సీలో స్వేచ్ఛ లభించినందుకు నా ధన్యవాదాలు' అన్నాడు లక్ష్మణరావు.

'మరేం చెయ్యడంరా, ఎంతకీ స్వేచ్ఛ దొరకని పక్షి ఏంచేస్తుంది, విలావిలా కొట్టుకోక? అలా కొట్టుకుంటున్నప్పుడది వేసిన నెత్తుకి లొంగిపోయో అది చస్తుందని భయపడో వొదిలెయ్యవచ్చుగా! మరి మన యెత్తు పారింది. స్వేచ్ఛ లభించింది. జీవితంలో సంతోషం చుక్కలుగా ప్రవేశించింది.'

'ఒరే నేనొకటడుగుతాను చెప్తావూ?'

'నీతో యేమిటి చెప్పలేదు బ్రదర్, ఈ ఒకటీ దాచుకోడానికి? అడుగు చెప్తాను.'

'నిజం దాచక చెప్తావని నమ్ముతున్నాను. నీకు పెళ్ళిట!'

'ఎవరు చెప్పారు?'

'అదుగో మొహం సీరియస్‌గా పెట్టేశావ్, ఏమీ ఎరగనట్టు?

'ఎవరు చెప్పేరు చెబుదూ!'

'నిన్న మీ వదినెగారు మా చెల్లితో అంటున్నదిలే'

'ఏమో అయితే కావచ్చు. కాని నేనంగీకరించనని నీకు తెలుసుగా!'

'తెలుసునులే - అయితే యీ మధ్య నీకు రాజమండ్రినించి ఉత్తరాలు రాలేదు కదూ?'

'రాలేదురా, అదే చూస్తున్నాను. నేను మళ్లీ ఉత్తరం రాసేవరకూ నువ్వు నా ఎడ్రసుకి ఏమీ రాయవద్దు అని రాసింది నెల కిందట. అప్పట్నించీ యే ఉత్తరం లేదు!'

'రాజమండ్రిలో లేరేమో వాళ్లు-?'

'లేకపోవడమేమిటి? ఇంకెక్కడికైనా పోతే వాళ్లకేముందీ? అక్కడయితే భూమి అదీ చూసుకుంటూ ఉంటారు.'

'అయినా ఉత్తరం రాయవద్దని అనటం దేమిరా, ఎవరయినా చూస్తారనా? వాళ్ళింట్లో ఎవరికీ చదువు తెలీదన్నావ?'

'చుట్టుపక్కలవాళ్లకి అనుమానమా మరి - పైగా ఈ మధ్య ఉద్యోగంకోసం ప్రయత్నిస్తుందిగా, మరి ఆ పోస్టుమేన్ వొచ్చేటప్పుడింట్లో లేకపోతే, మన ఉత్తరం చూస్తే?'

'అంటే,- ఉత్తరం రాయి - అని రాసిన తరవాత జవాబొచ్చేవరకూ యింట్లోనే, కదలకండా వుంటుందంటావ్.'

'కావచ్చును'

'కాని నీ దృష్టి అంత బీదవాళ్లమీద పడిందేమా అని నాకు పట్టుకుంది!'

'అదేమిట్రా పెద్ద రిఫార్మరువి, నువ్వే అలా అంటావ్! బీదవాళ్లకి సాయంచేసి వాళ్లని ఉద్ధరించడం తెలియని నా డబ్బు ఎందుకురా? కాల్చేందుకా! ఛష్. నేను మాత్రం అట్లా అనుకోవటంలేదు. ఎన్ని అడ్డంకులున్నా రానీ, ఎంత కష్టమైనా నన్నెదుర్కోనీ, ఆమెనే పెళ్లాడి ఆ కుటుంబాన్ని ఉద్ధరిస్తాను. చిన్నతనం నించీ అస్వతంత్రుడుగా ఉంటూ వొచ్చాను. కాని ఈ విషయంలో మాత్రం వాళ్ళకి స్వేచ్ఛ యివ్వను నా జీవిత సంబంధమైన విషయంలో వాళ్ళని అసలు జోక్యం చేసుకోనివ్వను. వాళ్ళయినా జోక్యం చేసుకోడానికి భయపడతారని నాకీ మధ్య తెలుస్తోందిలే.'

'ఏడిశావ్ కాని కొనొక వార్త చెబుతాను వింటావా? నిన్న మీ వదినెగారు మా చెల్లితో జరిపిన సంభాషణ ప్రకారం నీకు వొచ్చే నెలలోనే పెళ్ళి అనీ, నిన్ను అడక్కుండానే పెళ్ళి నిశ్చయం చేశారనీ ఇంకా చాలా విషయాలు తేలేయి.'

'కోస్తున్నావా?'

'కోస్తున్నానో మరేమిటో రెండు మూడు రోజుల్లో శుభలేఖలు ప్రింటవుతాయి! అప్పుడు చూద్దు గాని-ఇంకా విను-అయిదు వేలు కట్నంట. ఆ అమ్మాయి బావుండక ఎవరూ చేసుకోలేదట'

'నిజం!'

'ఏం ఒక్కమారు అంత భయమేసింది? మీ వాళ్ళ సంగతి తెలిసిపోయిందేమిటి? పెత్తిపెంగళాయా, చిన్నతనంనించీ ఏ చిన్న విషయంలోనూ స్వేచ్ఛలేని నీకు - స్వేచ్ఛ అంటే అనుభవ పూర్వకమైన అర్థం తెలియని నీకు నీ అంతట నువ్వు ఏదైనా పనిచెయడానికి తగిన సాహసం కలిగివున్నావనీ - కనీసం ఒక ఉద్దేశమంటూ నీకున్నదనీ, మీ పెద్దలు ఎట్లా అనుకుంటారోయ్? నీకు స్వేచ్ఛ కావాలంటే మెమ్మేలాగ కూర్చుంటే వొస్తుందా? వాళ్ళకి నువు నీవిషయం తిరుగుబాటుల ద్వారా బోధపరచాలి గాని మరోలా బోధపడుతుందా? నువు నీ జీవితంలో స్వేచ్ఛకి గాని తిరుగుబాటుకి గాని అర్థం తెలుసుకున్నావ్? లేదు. ఇంక నువు తిరుగుబాటు చేసేదేమిటి - నీకు స్వేచ్ఛ లభించేదేమిటి!'

'వీటన్నిటికీ యేంలే గాని నువు చెప్పింది నిజమా కాదా!'

'అదే వొచ్చింది నీతో తంటా. వీటన్నిటికీ యేంలే అని తోసి పారేస్తున్నావ్. అందుకే నీకు స్వేచ్ఛలేదు. అమెరికాలో - తల్లి దండ్రులు అనే పదానికి నిర్వచనాత్మకమైన అర్థం ఏమిటో తెలుసా? బిడ్డల ఆదేశాల్ని ఎంత ఎక్కువగా పాటిస్తే అంత మంచితల్లిదండ్రులన్న మాట. మనకి అట్లాసలపోలు ఆదేశాలు పాటించక

పోయారు నరేసరి - మనల్ని అదకత్తెరలో పెట్టి నొక్కి వేస్తున్నారు జీవితంలో ఈ సూక్తికి అనుభవం ఎంత ఉంది?'

'పోరా, లెక్చరు కొట్టావ్. చూడు యీ మేరేజి కేన్సిల్ చేయించుకు వస్తాను!'

* * *

ఆరు సంవత్సరాలు గడిచిపోయాయి——

'ఏమిరా, ఇంకా యీ గుమస్తా గిరీలోనే వుండిపోయావ్? అవును ఇది నీకెలా దాపరించిందిరా?' అన్నాడు లక్ష్మణరావు.

'మరి నువ్వుకూడా అదేపని చేస్తున్నావుటగా నన్నడం దేనికి?'

'బావుంది బావుంది. నీకూ నాకూ పోటీ తెచ్చావూ? మీరేమో బి. యస్సీ ఫస్టు క్లాసులు మేం స్కూలు ఫైనలు గ్రాడ్యుయేట్లం - బొంటింద్రులం మాకు గుమస్తా గిరీ రాసివుంది. సరేగాని మరి నువ్వీ గుమస్తా గిరీలో యెందుకుండి పోయావో చెబుదూ——'

'జీవితంమీద కోపం వొచ్చి. ఇంకా పోలేదు గాబట్టి'

'అబ్బోరే, పెద్ద పెద్ద మాటలు ప్రయోగిస్తున్నావే!'

'కాకపోతే యేమిట్రా?'

'అవును గాని నువ్వు గుమాస్తాగిరిలో యెందుకుండిపోయావూ అని నాకు పట్టుకుంది. బి. యస్సీ. పాసైయాక ఇంజనీరింగుకి పెట్టావటగా.'

'పెట్టాను. సీటుకూడా వొచ్చింది. అప్పుడు మాతృశ్రీగారు ఎడబాటు భరించలేక నా భవిష్యత్తూ నాశనం చేశారు.'

'నువ్వు ఇఫెక్టివ్‌గా మీవాళ్లతో వాదించలేదు కాబోలు!'

'ఎంత ఇఫెక్టివ్‌గా వాదించానో వాళ్ళకి తెలుసు నాకు తెలుసు. నా డయిరీ పుస్తకానికి తెలుసు. అపటికీ వాళ్లమనస్సు కరగలా. పోయింది దాంతో? పోలీసు సబిన్స్పెక్టరు టెస్టుకి అటెండయాను. అప్పటికి ఇంటో అందరికీ బెంగ పట్టుకుపోయింది. ఎక్కడ వేసేస్తారో, ఆమె ఎపాయింట్ మెంటు తీసుకోకు అని సలహాలు——

'అన్యాయం!'

'అన్యాయమని ఎందరికి తెలుసు! ఆ తరవాత రెండేళ్లకి ఇంట్లో వాళ్లందరూ కలిసి ఈ గుమస్తా గిరీనుంచి రివెన్యూ ఇనస్పెక్టరు గ్రేడులోకి నన్ను తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. వేకెన్సీలు కూడా వొచ్చాయిలే.'

'అగావేం? చెప్పు?'

'ఏముందిచెప్పటానికి? ఆ ఇంక్రిమెంటుకి నా మనస్సంగీకరించలేదు. అంత విచిత్రమైన సంగతి నీకుప్రపంచంలో ఎక్కడాకనపడలేదని అనబోతున్నావు కదూ! రానీ చెప్తాను - నాకు కారణాలున్నాయి. ఏమంటావు - ఇంతకాలంనించీ వాళ్లు చెప్పినట్టువిని చెడిపోయాను. బాగుపడితే వాళ్లకి ఆ మంచి మిగిలిపోతుంది. అందుకని వాళ్లకి చెప్పకండా, వాళ్ళ మాట వినకండా చెడిపోదామని నాకు అనిపించింది. ఇందువల్ల ఆత్మవంచన ఫలితం కావచ్చును కాని ఎలా అయితే నేమిటి వంచింప బడటానికి - అన్నాళ్లూ పరులచేత వంచింప బడ్డాను. ఇక అప్పుడు నా చేత వంచింప బడడానికి ఏమంత విచారించవలసింది నాకు కనిపించలేదు. నిన్ను నువ్వే మోసం చేసుకుంటున్నావ్ అని హెచ్చరించిన గడుసుకంఠాలు అనేకం గాలిలో కలిసిపోయాయి. ఆత్మవంచన యొక్క ఫలితం అందుకుందుకు నాకు సాహసం వచ్చేసింది. నేను ఇంక్రిమెంటుకి పెట్టనుగాక పెట్టను అని చెప్పేశాను. ఇంట్లో వాళ్లు నాలుగు రోజులు విస్తుబోయారు తరవాత చల్లగా వూరుకున్నారు.'

'...............'

'నువ్విలాంటప్పుడు మాట్లాడలేక పోయావంటే అర్థం లేకపోలేదు. నేనే స్వంత స్పెల్ బౌండ్‌గా ఉంటాను ఒక్కొక్కప్పుడు

ఎందుకు, అసలు జీవితం మీద విరక్తి పుట్టిందంటే తప్పా? నేను తలుచుకున్నది ఒకటీ జరగలేదు వివాహంకూడా నా యిష్టప్రకారం జరగలేదనడానికి ఇంట్లో వుంది సాక్ష్యం. కాని ఆవిడ ఎట్లాంటిది? సౌందర్య విహీనత వలన తోటి మానవులపై స్వాభావికముగా తనకు గలుగుతున్న ఈర్ష్యకు దాసురాలై పరులపై ఒక స్వాభావికముగా తనకు గలుగుచున్న ఈర్ష్యకు దాసురాలై పరులపై ఒన వ్యర్థాధికారము సాగించు

టకు-, చూస్తుంది. ఎవరు లొంగుతారు ఆ అనధికార అధికారానికి?'

'...............'

'వస్తా బ్రదర్—చివరికి ఇల్లా అయింది నా బ్రతుకు. బాల్యంలో తల్లిదండ్రులకే గాక చుట్టూ ఉన్న వ్యక్తులందరికీ, కాస్త వయసొచ్చాక తల్లిదండ్రులకు - ఇంకా బాధ పడ్డాక వ్యధితమైన స్వహృదయానికి - బానిసనై, ఆత్మ సంయమం అంటే ఏమిటో యెఱుగక శృంఖలా నిబద్ధుడైన పరకీయునివలె - ఉక్రోషంతో వెళ్తున్నాను. ఎవరు వింటారు ఈ అరణ్య రోదన!'

'వెరీసారీ బ్రదర్! పూర్వస్మృతులను త్రవ్వి నీకు దుఃఖం కలిగించాను. వస్తా!'

* * *

మరో ఆరు సంవత్సరాలు గడిచిపోయాయి.

'ఎన్నాళ్ళకి రా లక్ష్మణా. ఇప్పుడేం చేస్తున్నావ్?'

'డెప్యూటీ తాసిల్దారుగా వున్నాను. మీ ఫాదరూ మదరూ పోయారటనే - ఎన్నాళ్ళయింది? మరి నువ్వేం చేస్తున్నావ్?' అన్నాడు లక్ష్మణరావు.

'పోయారు. ఇంకా మా అన్నయ్యకూడా కలకత్తా వెళ్ళిపోయాడు. వాడక్కడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా వున్నాడు. నేనింకా గుమస్తానే. నువు డెప్యూటీ తాసిల్దారువా? అక్కడేనా?'

'అవునురా, స్థానబలిమివల్ల. కాని నువ్వింకా నీ విరక్తిమనస్సుని మార్చుకో లేదన్న మాట. ఎందువల్ల?'

'నా మనస్సు మరిమారదు. అంతే అది. శిధిలమైన...'

'కవిత్వం వెలిగించకు. నీకు స్వేచ్ఛలభించిందిగా మరి—?'

'—అవును. పవిత్ర భారతదేశంలో ఎవడికి స్వేచ్ఛ లేదు? ఆకోణంలో వున్న స్వేచ్ఛ నాకు, నన్ను ఎంతో కాలంగా అణగ ద్రొక్కిన తల్లీ తండ్రీ అన్నగారూ నాదగ్గిర్నించి కదిలిపోయినా, నా నిత్యజీవితంలో లభించలేదు. స్వేచ్ఛకోసం ఈ ప్రాణి ఇంకా కటకటలాడుతూనే వున్నాడు'

'అంటే?'

'అంటే యేమిటో తెలుసుకోలేని వెర్రి వెద్దమ్మవని నేను తలచలేదు. ఏ మగవాడూ తాను తన భార్యకి దాసుడుగా ఒకవేళ ఉండేటట్టయితే అలా జరుగుతున్నదని చెప్పుకోక పోయినా నాలో తెగింపెక్కువై పోయింది. చెప్తా విను. నాకు దేనికీ స్వేచ్ఛలేదు. ఓ సినిమాకి పోదామన్నా, ఇంటికి ఏవిధంగానో కాస్త ఆలస్యంగా వెడదామన్నా అధికారం లేదు. నలభై రూపాలకి నా చెయ్యి మనస్ఫూర్తిగా గవర్నమెంటుకి ఎట్లా అమ్ముడుపోయిందో, రెండు పూట్లా రుచికరమైన తిండికి ఈ శరీరం అంతా ఇంట్లో వున్న స్త్రీకి అంకితమైపోయింది. మళ్ళీ ఇంటికి నేను పెందరాడే పోయి చేసేపని ఏమీ లేదనుకో-ఆ పదేళ్ళ గుంటడితో ఆడుకోవటం తప్ప ఆఫీసులో మిగిలిపోయిన పని ఇంటిదగ్గిర ఎట్లానూ పూర్తికాదు. ఆ నరకంలో మరో ఎట్మాస్ఫియర్ కలగదు-విశ్వ ప్రయత్నం చేసి చచ్చినాసరే...'

'నిజమేనా కలాయింది?'

'దేనిగా భావించుకుంటావో మరి. స్వేచ్ఛ లేదు. శృంఖలా నిబద్ధుణ్ని. మళ్ళీ నెమరు వెయ్. చిన్నతనంనించీ, ఏ చిన్న విషయంలోనైనా తల్లిదండ్రులకీ అన్నగారికీ అనుగుణంగా నడుచుకున్నాను. స్వేచ్ఛ కోరలేదు. ఫలితం అనుభవిస్తున్నాను.

* * *

ఓయి భగవంతుడా! ఇకనీదైంది ఈ పక్షిని ఆడించటం వొంతు. లక్ష్మణరావూ! నువ్వు విను నా చరిత్ర అంతా! ఈ ప్రపంచంలో స్త్రీలు ఎవరినైతే తమకు స్వేచ్ఛలేకుండా చేస్తున్నారనే నిందతో ధమాయిస్తున్నారో, ఆ పురుషుడికి, స్థూలదృష్ట్యా స్వేచ్ఛ లేదు. శృంఖలాలు పురుషుడిని స్త్రీకన్న ఎక్కువగా బాధిస్తాయి. స్త్రీ శృంఖలాలకి జాలి అనేది సహాయం చేస్తుంది. కాని పురుషుడి శృంఖలా నిబద్ధతకి మరి సహాయం లేదు. చేయూతా లేదు. బాల్యంలోనూ యౌవనంలోనూ భార్య వచ్చేవరకూ పురుషుడు తల్లిదండ్రుల చేతుల్లో కీలుబొమ్మగా వుంటున్నాడు. ఆనక భార్య వాడి స్వేచ్ఛని అరికడుతుంది. ఆనక పిల్లలుపుట్టే వాళ్ళు తనచరిత్ర తెలుసుకుని అతి హీనంగా ట్రీట్ చేస్తున్నారు. అందుచేత పురుషుడు ఎల్లప్పుడూ శృంఖలా నిబద్ధుడే. వాడికి విముక్తిలేదు.'